క్లుప్తంగా

నేటి నుంచి నటన, నృత్యంపై శిక్షణ

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 3వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు నెల రోజుల పాటు నృత్యం, నటనపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. బొబ్బిలికి చెందిన యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో బాలబాలికలు, మహిళలకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నట్లు ఆడిటోరియం కార్యదర్శి నంబియార్ వేణుగోపాలరావు, యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు మింది విజయమోహనరావు పేర్కొన్నారు. అనంతరం శిక్షణాంశాలకు సంబంధించి రూపొందించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు శిక్షణా తరగతులు ఉంటాయని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9440744741ను సంప్రదించాలని కోరారు.

అక్రమ నిర్మాణాలకు ప్లానర్లే బాధ్యత వహించాలి

బొబ్బిలి: పట్టణంలో అక్రమ నిర్మాణాలకు వార్డుల్లోని ప్లానర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం సందర్భంగా స్థానిక పట్టణంలోని తన కార్యాలయంలో పట్టణ ప్రణాళికా విభాగం, సచివాలయ కార్యదర్శులు, టెక్నికల్ సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రధాన కూడళ్లు, రోడ్లు పక్కన, ఫ్లైఓవర్‌పైన ఎటువంటి ప్రకటనల ఫ్లెక్సీలు, అనుమతులు లేని హోర్డింగ్‌లు ఉండరాదన్నారు. అనుమతులు లేకుండా వేటినైనా ఏర్పాటు చేస్తే గుర్తించి జరిమానా విధించాలన్నారు. అలాగే పట్టణంలో ఎటువంటి అనధికార నిర్మాణాలు జరగకుండా ప్లానింగ్ సెక్రటరీలు చూడాలన్నారు. ఖాళీ ప్రదేశాలను ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలన్నారు.

గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు

బొబ్బిలిరూరల్: ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ఈఈ రంగారావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బొబ్బిలి డివిజన్‌లో మొత్తం 1,888 ఇళ్ల నిర్మాణాల పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, వారితో నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. సమావేశంలో డీఈ అప్పయ్య, ఏఈ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

బొబ్బిలి: విద్యార్థులంతా శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జేవీవీ నాయకుడు కె.కృష్ణదాసు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరిలు సూచించారు. స్థానిక వాసు జూనియర్ కళాశాలలో జేవీవీ, గ్రీన్‌బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరాన్ని వారు శుక్రవారం సందర్శించి, అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి కాసేపు మాట్లాడారు. మూఢనమ్మకాలు విడనాడాలని, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థానాలు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు.

మద్యం బెల్టుషాపుల నియంత్రణకు చర్యలు

రాజాం: అన్ని గ్రామాల్లో మద్యం బెల్టుషాపుల నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ అన్నారు. ఇదే విషయమై ఆయన స్థానిక పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. 2025 జనవరి నుంచి ఇప్పటి వరకు 55 మందిపై కేసులు నమోదు చేసి 545 మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా మద్యం బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయించినా, గొలుసు దుకాణాలకు వేలం పాటలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, అటువంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

రాజాం సిటీ: గ్రామ సచివాలయాల్లో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు అందుబాటులోకి తీసుకువస్తున్న ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఆధార్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 5న నందబలగ, 6న కంచరాం, 7న పొగిరి, 8న అంతకాపల్లి గ్రామ సచివాలయాల్లో నిర్వహించనున్నామన్నారు. ఇంకా ఆధార్ నమోదు కాని 0-6 సంవత్సరాల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలన్నారు.

బాడంగి: మండల కేంద్రం సహా గజరాయునివలస గ్రామంలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఆరేళ్ల వయసు లోపు చిన్నారులకు సంబంధించి, ఆధార్ కార్డు జారీకి ఈ నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు, 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రెండు విడతల్లో ఆధార్ నమోదు కేంద్రాల నిర్వహణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- సేంద్రియ ఎరువులతో నేల సారవంతం
- పశువుల గెత్తం, గొర్రెల కొట్టంతో భూసారం
- చెరువు మట్టితోనూ నేలకు మంచి పోషకాలు
- వేసవిలో దుక్కులకు ముందే వేసుకోవాలి
- ఫలితంగా మంచి పంట, అధిక దిగుబడులు

సేంద్రియం.. నేలకు బలం!


పొలంలో వేసేందుకు పశువుల గెత్తంను ట్రాక్టరులోకి లోడ్ చేస్తున్న రైతులు


భూసారం పెంచేందుకు పొలంలో వేసిన గొర్రెల మంద

రామభద్రపురం: రసాయనిక ఎరువులు వీడి, సేంద్రియ ఎరువులు వినియోగిస్తే నేలసారవంతం పెరిగి తద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. ప్రధానంగా పశువుల గెత్తం, గొర్రెలు, మేకల కొట్టం(వ్యర్థాలు)తో భూసారం పెరుగుతుందని, చెరువు మట్టితోనూ నేలకు మంచి పోషకాలు అందుతాయని చెబుతున్నారు. ఖరీఫ్ సాగుకు ముందు ఆయా సహజ ఎరువులు వినియోగిస్తే వేసే పంట ఏపుగా పెరిగి, తెగుళ్లను తట్టుకుని నిలబడగలదని సలహా ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్నదాతలు కూడా సేంద్రియ ఎరువుల వాడకానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ఎక్కువగా రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల భూసారం కోల్పోతుందని, పశువులు, గొర్రెలు, మేకల విసర్జితాల(పేడ/గెత్తం)తో నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి సూక్ష్మపోషకాలు నేలకు అందుతాయని గ్రహిస్తున్నారు. ఫలితంగా ప్రస్తుతం చాలాచోట్ల రైతులు సేంద్రియ ఎరువులు వాడకానికి ముందుకువస్తుండడం శుభపరిణామం.

మేకలు, గొర్రెల మంద..

గతంలో ప్రతి రైతు ఇంట ఆవులు, గేదెలు, ఎద్దులు ఉండేవి. వాటిని రాత్రి సమయాల్లో పొలంలోనే కట్టేసేవారు. వాటి విసర్జితాలు సేంద్రియ ఎరువుగా నేలకు ఉపయోగపడేవి. దీనివల్ల ఎరువుల ఖర్చు తగ్గేది. ఇదిలా ఉంటా ఏటా వేసవిలో భూసారం పెంచుకునేందుకు పొలంలో గొర్రెలు, మేకల మంద కట్టడం సర్వసాధారణం. గాఢనిద్రలోని గొర్రెలు, మేకలను రాత్రిపూట ఎక్కువసార్లు నిద్ర లేపితే అధికంగా విసర్జితాలు(పింద్రికలు) వేస్తాయి. దీనివల్ల సేంద్రియ ఎరువు అధిక మోతాదులో దొరుకుతుంది.

వేసవిలోనే గెత్తం తరలించాలి..

సంవత్సరం పొడవునా నిల్వ చేసిన పశువుల ఎరువు(గెత్తం)ను వేసవి కాలంలోనే పొలానికి తరలించాలి. వర్షాలు పడిన తర్వాత ఈ ఎరువును నేలపై చల్లి దుక్కి దున్నితే మట్టిలో బాగా కలుస్తుంది. తద్వారా పంటకు అవసరమైన పోషకాలు అందుతాయి. వేసవిలో లోతు దుక్కిలు దున్నితే కలుపు, గత పంట అవశేషాలు లేకుండా నేల శుభ్రంగా ఉంటుంది.

మంద కట్టిన తర్వాత దున్నుకోవాలి..

గొర్రెలు, మేకల మందను పొలాల్లో వేసుకున్న తర్వాత వాటి విసర్జితాలు నేలలో బాగా కలిసేలా దున్నుకోవాలి. ఇలా చేయడం ద్వారా నేలకు మేలు చేసే సూక్ష్మజీవులు పెరుగుతాయి. ముఖ్యంగా చెరువు మట్టిని పొలాల్లో నింపితే పంటకు అవసరమైన సూక్ష్మ, స్థూల పోషకాలతో పాటు సేంద్రియ కర్బనాలు లభిస్తాయి. పంటలు బాగా పండుతాయి.

–వీటీ రామారావు, జిల్లా వ్యవసాయాధికారి, విజయనగరం

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


బాడంగిలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి


తెర్లాం:ఎం.ఆర్.అగ్రహారంలో కిశోరి వికాసంపై అవగాహన


రామభద్రపురం: నాయుడువలసలో సూచనలిస్తున్న సర్పంచ్ లక్ష్మి


వంగర: మద్దువలసలో కిశోరి బాలికలను చైతన్యం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజనీదుర్గ

వాడవాడలా కిశోరి వికాసంపై అవగాహన కల్పిస్తూ సదస్సులు, ర్యాలీలు శుక్రవారం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిశోరి బాలికలంతా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులు సూచించారు. వేసవి సెలవుల్లో 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసు బాలికలందరికీ విద్య, ఆరోగ్యం, భద్రతే లక్ష్యంగా జూన్ 12వ తేదీ వరకు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ పీవోలు పేర్కొన్నారు. ముఖ్యంగా రుతుచక్రం సమయంలో పాటించాల్సిన పరిశుభ్రతా చర్యలు, రక్తహీనత బారినపడకుండా తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. –బాడంగి, బొబ్బిలిరూరల్, తెర్లాం, రామభద్రపురం, వంగర

రూ.307 వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు



రాజాం: వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: రోజుకు రూ.307లు వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేయాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు వేతనదారులకు సూచించారు. మండలంలోని వీఆర్‌అగ్రహారం గ్రామంలో చేస్తున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండు పూటలా సమయానికి హాజరై, ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయాలని తెలిపారు. పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలన్నారు.

తెర్లాం: ఉపాధి హామీ పథకం పనులకు గునపాలు, టెంట్లను ప్రభుత్వమే పంపిణీ చేయాలని మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఉపాధి వేతనదారులు కోరుతున్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో(మూడేళ్ల క్రితం) గునపాలు, టెంట్లు పంపిణీ చేశారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు గునపాలు గానీ, టెంట్లు గానీ ఇవ్వలేదన్నారు. టెంట్లు లేకపోవడంతో ఎండలోనే పనులు చేయాల్సి వస్తోందని వాపోయారు.

రేగిడి: ఉపాధి హామీ పనుల్లో బినామీ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తప్పవని ఏపీవో ఎస్.హరనాధరావు సూచించారు. మండలంలోని గోపింపేట, లక్ష్మీపురం, దేవుదళ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు.

మోక్షప్రదాయిని భగవద్గీత

రేగిడి: భగవద్గీత మోక్షప్రదాయిని అని, భగవద్గీత పఠిస్తే చెడుగీతలు చెరిగిపోతాయని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ తెలిపారు. మండలంలోని దేవుదల గీతా మందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్య జీవన సత్సంగ సమావేశం శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవితాన్ని బిజీగా గడపడం వల్ల మానసిక ప్రశాంతత కోల్పోతున్నారన్నారు. రోజులో ఎంతో కొంత సమయాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయిస్తే మానసిక ప్రశాంతత లభ్యమవుతుందన్నారు.

దాడితల్లి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

బొబ్బిలి: స్థానిక పట్టణంలో ఈ నెల 4, 5, 6వ తేదీల్లో జరిగే దాడితల్లి ఉత్సవాల ఏర్పాట్లపై ఎమ్మెల్యే బేబీనాయన తన స్వగృహంలో శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో పండగ జరిగేలా చర్యలు చేపట్టాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, డీఈఈ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

బొబ్బిలి: పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ శుక్రవారం చేపట్టారు. టీఆర్ కాలనీ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ దేశ ప్రజలందరి సమన్యాయం కోసం రూపొందించబడిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. ఎక్కడా రాజ్యాంగ ఉల్లంఘన జరగకుండా చూసుకోవాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

బొబ్బిలిరూరల్: మండలంలోని కోమటిపల్లి గ్రామ ఆయుర్వేద ఆస్పత్రిలో వేసవి ఉచిత యోగా శిక్షణా తరగతులకు దరఖాస్తు చేసుకోవాలని వైద్యాధికారి సీహెచ్ కనకమహాలక్ష్మి కోరారు. ఇదే విషయమై ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. యోగాపై ఉదయం, సాయంత్రం శిక్షణ ఉంటుందన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

రేగిడి: మండలంలోని రేగిడి గ్రామంలో సత్యసాయి భజన మండలి సభ్యులు శుక్రవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విశ్వసాయి మందిరం వార్షికోత్సవంలో భాగంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వంగర: మండలంలోని కొప్పరవలసలో సోమలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయడంతో పాటు పార్వతీపరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలో అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. అర్చకులు రేజేటి సత్తిబాబు, రేజేటి వంశీకృష్ణల ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు, సూర్యనమస్కారాలు చేశారు.

పంపిణీకి పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం


పచ్చిరొట్ట విత్తనాల బస్తాలు చూపిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్యామ్‌సుందర్

బొబ్బిలిరూరల్: రైతులకు 50 శాతం రాయితీపై పంపిణీ చేసేందుకు పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం చేసినట్లు వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామ్‌సుందర్ తెలిపారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పచ్చిరొట్ట విత్తనాలతో పాటు జీలుగులు 370, కట్టిజనుము 80, పిల్లిపెసర 10 క్వింటాళ్లు చొప్పున అందుబాటులో ఉంచామన్నారు. జీలుగులు 10 కిలోలు సబ్సిడీ పోను రూ.615, కట్టిజనుము రాయితీ పోను రూ.545, పిల్లిపెసర 8 కిలోల బస్తా రాయితీ పోను రూ.720లకు అందజేస్తామన్నారు. నేల సారవంతానికి ఈ ఎరువులు ఉపయోగపడతాయని, త్వరితగతిన రైతులు తీసుకోవాలని కోరారు.

తాగునీటి కుళాయిలు ప్రారంభం

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ ఎస్సీ, యాదవ వీధుల్లో కొత్తగా ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలను శుక్రవారం ప్రారంభించారు. మొత్తం 63 కుళాయిల ద్వారా ఆయా వీధుల్లోని ప్రజలకు తాగునీటి సరఫరాకు మార్గం సుగమమైందని ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఎంపీటీసీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.శ్రీచరణ్, పంచాయతీ కార్యదర్శులు కూర్మారావు, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేట శివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులతో బీపీ సుగర్, ఈసీజీ, టుడీఎకో, కళ్ల పరీక్షలతో పాటు గుండె సంబంధిత తనిఖీలు చేశారు. శిబిరానికి 365 మంది రోగులు హాజరై, తనిఖీలు చేయించుకోగా 45 మందిని ఉన్నత వైద్యం, తనిఖీల కోసం రిఫర్ చేశామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు కేఎల్ ప్రసన్న, జి.లాస్య, బ్రహ్మారెడ్డి, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని మునకలవలస గ్రామంలో రాజాం కేర్ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత చర్మవ్యాధుల వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పలువురికి వైద్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దాహం తీర్చని నీటి తొట్టెలు

- నిర్మాణం సరే.. వినియోగం ఎప్పుడు..!


పురిటిపెంట గ్రామంలో వృథాగా ఉన్న నీటి తొట్టె


డోలపాలెంలో నిర్మాణంలో ఉన్న నీటి తొట్టె

గజపతినగరం రూరల్: వేసవి నేపథ్యంలో మూగజీవాల దాహార్తితో అల్లాడుతున్నాయి. రోజురోజుకు ఎండలు మండిపోతుండడంతో ఎక్కడికక్కడే వాగులు, కుంటలు, చెరువులు నీటి వనరులు అడుగంటిపోతున్నాయి. ఈ క్రమంలో మూగజీవాల దాహార్తి తీర్చేలనే ఉద్దేశంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో 31 పంచాయతీలకుగాను తొలి విడతలో 21 గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మించారు. అయితే ఆ.. తొట్టెలలో అధికారులు కొన్నింటిలో నీటిని నింపి మరికొన్నింటిని వృథాగా విడిచిపెడుతుండడంతో నిరుపయోగంగా మారాయి. మండలంలో 21 పంచాయతీలలో నీటి తొట్టెల నిర్మాణం చేపట్టారు. ఒక్కో తొట్టెకు రూ.35,443లను ఖర్చు చేసి రూ.7లక్షల 44,303లతో నిర్మాణాలు జరిపారు. అయితే నిర్మాణాలు పూర్తి చేసినా...వినియోగంలోకి తీసుకురాకుండా వృథాగా ఉంచేయడంతో ఏం ప్రయోజనమని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారుల తీరుతో మూగజీవాల దాహార్తి తీరడం లేదని పేర్కొంటున్నారు. నిర్మించిన నీటి తొట్టెల్లో నీటిని నింపితే చాలా వరకు మూగజీవాల దాహార్తి తీరే అవకాశం ఉందని, లక్ష్యం కూడా నెరవేరుతుందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు అధికారులకు సూచిస్తున్నారు.

నీటి సాకర్యం కల్పించాలి

పంచాయతీ పాలకులు, సంబంధిత అధికారులు గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్టెల్లో నీటిని నింపి మూగజీవాల దాహార్తిని తీర్చాలి. రోజురోజుకు ఎండలు మండిపోతుండడంతో మూగజీవాలు దాహార్తితో ఇబ్బందులు పడుతున్నాయి. అధికారులు సానుకూలంగా ఆలోచించి వాటి దాహార్తిని తీర్చాలి.

– చనపతి రామునాయుడు, రైతు, డోలపాలెం

నీటితో తొట్టెలను నింపమని చెప్పాం

గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయిన తొట్టెల్లో నీటితో నింపమని ఆయా క్షేత్ర సహాయకులకు ఆదేశాలు జారీ చేశాం. తొట్టెలు ఖాళీ కాగానే నింపడం జరుగుతుంది. ఎక్కడైనా వృథాగా ఉన్నట్లు తన దృష్టికి రాలేదు. తక్షణమే దృష్టి సారించి అన్నింటిని వినియోగంలోకి తీసుకువస్తాం.

– కృష్ణవేణి ఏపీఓ, గజపతినగరం

ఆరోగ్యంపై రసాయన ప్రభావం

చీపురుపల్లి రూరల్(గరివిడి): స్వచ్ఛమైన ఫలాలు మనిషికి ఎంతో మంచి ఆరోగ్యాన్ని చేకూరుస్తాయి. మార్కెట్లో దొరికే అన్ని రకాల పండ్లు ఆరోగ్యమే. ప్రస్తుతం మామిడి పండ్లు సీజన్. మామిడి ఏడాదికోసారి దొరికే ఫలం. ఏడాదికోసారైన సామాన్యుడు కొనుక్కొని తినగలిగే తక్కువ ధరలో లభించే ఫలం. మామిడితో పాటుగా మనిషికి మంచి ఆరోగ్యాన్ని అందించే పండ్లలో అరటి పండు కూడా ఆరోగ్య ప్రదాయినిగా చెబుతారు. అరటి పండ్లు సరసమైన ధరకు సామాన్యుడికి ఏడాది పొడవునా దొరికే ఫలం. సామాన్యుడు తినగలిగే అరటి, మామిడి పండ్లపై రసాయనాల ప్రభావంతో ఆకర్షించే రంగుల్లోకి తీసుకువచ్చి ప్రజలకు అమ్ముతున్నారు. ఇలాంటి పండ్లు తింటే ఆరోగ్యాలు పాడవుతాయని తెలిసినా ఏడాదికోసారే కదా, ఏడాది పొడవునా దొరకవు కదా అని చెప్పి కొనుగోలు చేసి తింటున్నారు. ఈ పండ్లును తిని అనారోగ్యాలను కొని తెచ్చుకుంటున్నారు. ఈ రకమైన రసాయనాలతో కూడిన పండ్లును యథేచ్ఛగా అమ్మకం చేస్తున్నప్పటికీ పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ఇలాంటి ప్రభావం మరింత పెరుగుతుందని కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేందుకు రైతు వినియోగించే రసాయనాలు, పండ్లను మగ్గపెట్టేందుకు వాడే కార్బయిడ్ వంటి రసాయనాల ప్రభావంతో మనం తినే ఆహార పదార్థాలు, పండ్లు విషతుల్యమవుతున్నాయి. ఇలాంటి విషతుల్య ఆహారం తీసుకోవటం వలన కేన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.